# పిచ్చిడబ్బు

రచన :
వెంకటేశ్వరరావు.

"అబ్బాయికి ప్రమోషన్ అయిందన్నారు యీ మధ్య! జీత మెంత?" అన్నది ఓనాడు మాఅమ్మ చేటలో బియ్యము పోసుకొని దొడ్డివసారాలో కూచొని బాగుచేస్తూ.

అక్కడేకూచుని పువ్వులు గుచ్చుకుంటూన్న చిట్టి "జీతం రెండువందలు! అలవెన్సులూ - అవీ - కలుపుకొని మొత్తం మూడువందలు కాబోలువస్తాయి" అంది.

"అదృష్టవంతురాలవే అమ్మా నీవు!" అంది మాఅమ్మ.

"ఏమి అదృష్టం? ఎంతచెట్టు కంతగాలి అని జీతం యెక్కువయినకొద్దీ ఖర్చు యెక్కువవుతుంది గాని తగ్గదు గదా?"

"పొదుపుగా చేసుకుంటేసరి! మా కాలంలో యింత డబ్బేది?"

"ఏం పొదుపు? అన్నీ కావాలామణి? ఏ హోదాకు తగినట్లు ఆ హోదాకు నడచుకోకపోతే లోకు లేమను కుంటారు?"

"లోకులేమన్నా అనుకుంటారని డబ్బు వృధాగా ఖర్చుపెడ్తామా? వచ్చిందంతా యెప్పటికప్పుడే సర్వమంగ ళంచేసుకుంటే తరువాత యెల్లాగుమణి?"

"తరువాతిమాట తరువాతే! ప్రస్తుతంగడిస్తే తరువాతి మాట!" అంది చిట్టి తనుతయారుచేసిన చేమంతి చెండు జెడలో సింగారిస్తూ.

"అబ్బ! ఏమి అబ్బురమే? మూడువందల రూపా యిలు వస్తుంటేనే సంసారం గడుపుకోలేకపోతే నలభైయాభై రూపాయలతో మా కాలంలో ఎల్లా గడుపుకునే వాళ్లం అనుకున్నావు?" అంది.

"ఆ కాలంవేఱు! అప్పట్లో నలభై, యేభై రూపాయిలు కూడా అక్కర్లేదు! సామాన్య సంసారానికి యింకాతక్కువే కొల్లలై పొయ్యేది! అవిచవుకరోజులు! ఇప్పుడన్నీ ప్రియమూ- కాటకమునూ"

ఎంత ప్రియమైనా, యెంత కాటకమైనా జాగ్రత్తగా వాడడంలోవుందిగా మణి!"

"ఏమి జాగ్రతో? ఇంకా ఏమిజాగ్రతగా వుండాలో చూద్దురుగాని యీ నెలలో వాడకం! అప్పుడు మీకే తెలుస్తుంది."

వాళ్ళావిధంగా సంభాషించుకోవడం సావిట్లో కూచొని ఆఫీసుపని చేసుకుంటూన్న నాకు వినిపించింది. మాఅమ్మ కొంచెం పక్కవాటుగా కూచోవడం మూలంగా నాదృష్టికి ఆనడంలేదు. కాని చిట్టి నాకు తిన్నగా వుండడంచేత నా దృక్పథంలోంచి తప్పిపోలేదు. మా రాము — ఇందిరా వాళ్ల తాతాయితోకలిసి మ్యాటినీపొకి వెళ్లడంచేత యింట్లో వాళ్లసందడిలేదు. ఆరోజు ఆదివారం అవడంచేతనూ, మా అమ్మా-నాన్న అకిందటి సాయంకాలమే రాకరాక మా యింటికి రావడంచేతనూ, నేనెక్కడికీ క్యాంపు వెళ్లకుండా యింటివద్దే అప్పటిదాకా వాళ్లతో కాలక్షేపంచేసి, ఆఫీసు కాయితాలేవోవుంటే వాటిని "చుణామణీ" చేస్తున్నాను.

అప్పుడు సాయంత్రం సుమారు నాలుగుగంటలైనా అయివుంటుంది. చిట్టీ-మా అమ్మా మాట్లాడుకునే మాటలు నేను వింటూనే వున్నాను. నేనుమాత్రం జోక్యం కలుగ జేసుకోలేదు అప్పట్లో! కాని మాఅమ్మ ధోరణినిబట్టి, మేము వచ్చిన డబ్బంతా దూబరాగా ఖర్చుచేస్తున్నట్లూ, అదేఆవిడ అయితే జాగ్రత్తగా ఖర్చుపెట్టి, నెలకేవందో, ఏభయ్యో నిలవ చేసి చూపించగలదేమోనని నాకు అనుపించకపోలేదు.

చిట్టి పువ్వులు గుచ్చుకోవడం అయిన కాస్సేపటికి "టీ" తయారుచేసి కప్పులోపోసి నా యెదర టేబిలుబల్ల మీదపెట్టి వెళ్లిపోబోతోంది. అప్పుడు నేనేదో ఒహ గట్టి కాయితం అతి సీరియస్‌గాచూస్తూ తలపైకెత్తి

"చూడుచిట్టీ!" అన్నాను.

చిట్టి వెనక్కుతిరిగింది.

ఇంతలో నేనాలోచిస్తున్న కాయితం ఫయిసలుకాగా, అది రికార్డుచేస్తూ, చిట్టితెచ్చిన "టీ" కొంచెం కొంచెంగా పెదవులతో చప్పరిస్తున్నాను.

"ఏం. ఎందుకూ పిలిచేరు?" అంది చిట్టి.

తలయెత్తకుండానే "ఔను! పిలిచేను. ఉండు! వెళ్దువుగాని" అన్నాను.



కొన్నిరోజులు గడిచినై! ఇంట్లో మామూలు ఖర్చు యేమీ తగ్గలేదు. మాఅమ్మ యెంత తగ్గిద్దామన్నా వీల్లేకపోయింది. కారణం, మే మదోరకమైన జీవితాని కిన్నాళ్లూ అలవాటుపడి వుండడమే! మఱిన్నీ ప్రస్తుతం దేశంలోవున్న కరువు అంతకంతకు హెచ్చుతూవుంది, కాని తగ్గితేగా నాలుగు డబ్బులు మిగలడానికి. మా అమ్మ యెంత పిదపగా చేద్దామన్నా, ప్రతివిషయంలోనూ, రోజుకు రోజుకు కాయితాలూ - రూపాయిలూ, పిచికలులాగు యెగిరిపొయ్యేవి! ఎప్పటి కప్పుడు యీ పది రూపాయిలు దాచి, ఇవి నేను మిగల్చగలిగేను అని చెప్పడానికి మా అమ్మకు వీలు లేకుండా, అంతకుముందే యేదో ఒహ ఖర్చువచ్చి కూచునేది. పాప మావిడమట్టు కేమిచేస్తుంది? ఏరోజు కారోజు యింటివాడకానికి నోట్లు మారుస్తూవుండడం! ఇంట్లోకి తెచ్చే వెచ్చాలు కన్నునిండకపోవడం!! అన్నివస్తువులూ యెత్తుకు మూడు నాలుగెత్తులు ప్రియమూ - కాటకమూను. అందులో కంట్రోల్సూ-బ్లాకుమార్కెట్లూ! ప్రాణం విసిగిపోయింది పాపమావిడకు. ఎన్ని కాయితా లావిధంగా ఆవిడ తన చేతి మీదుగా ఖర్చుపెట్టిందో తన మనస్సులో యెంత యిష్టంలేకపోయినా! కాని ఫలితం అంతాలేమీ! అసంతృప్తీ!!

చిట్టి నిలబడి నాకేసి చూస్తోంది.

టీ పుచ్చుకోవడం, కాయితం రాయడంకూడా అయిపోయినయి.

ఖాళీకప్పు చేతికిస్తూ "అయితేచిట్టీ! ఈనెలా వచ్చేనెలా మా అమ్మా-నాన్న యిక్కడేవుంటారు గనుక అమ్మనే వాడమను యింటి వాడకం అంతా" అన్నాను.

"ఊఁ!" అందిచిట్టి.

"ఊఁ కాదు. నిన్ననే జీతాలు వచ్చేయిగనుక డబ్బంతా ఆవిడకిచ్చేయి. ఆవిడే ఖర్చుపెడుతుంది" అన్నాను నిష్కర్షగా.

"ఔను! నిజమే! నేనయితే అంతాఖర్చే! ఆవిడ అంత జోరుగా ఖర్చుపెట్టదు. నాలుగుడబ్బులన్నా మిగులుస్తుంది"

మా వుభయుల అభిప్రాయాలూ అక్కడ ఏకీభవించినయి. తిర్గి నేను తలపైకెత్తి చిట్టిమొహంలో చూస్తూ—

"ఔను! అల్లాచెయ్యి" అని మిగతాపని చూచుకొంటున్నాను.

చిట్టి వెళ్లిపోయింది. ఆరోజే యిన్నాళ్లనుంచీ తన భుజాలమీదనున్న సంసారభారం చిట్టి మా అమ్మ కెత్తింది. మా అమ్మకూడా పూర్వకాలం మనిషిగనక, తానారోజునుంచీ సంసారం గడపడానికి పేచీపెట్టలేదు. నేనూ--చిట్టీ సంతోషించేం! పెద్దవాళ్లమీదే సంసారభారం పడేస్తే, యీరోజుల్లోవుండే కష్టసుఖాలు వాళ్లకూ్కడా తెలుస్తవి. మనం కులాసాగా కాలక్షేపం చెయ్యవచ్చు ననుకున్నాం మేమిద్దరమూ.

ఓ నాడామె "నావల్ల కాదు యీసంసారం దిద్దడం! ఎవరి సంసారాలు వాళ్లే చేసుకోవడం మంచిది" అంది చిట్టి కెదురుగా కూచుని మధ్యాహ్నంవేళ.

చిట్టి ఆవిడకేసి ఆశ్చర్యంగా చూస్తూ అక్కడే మా నాన్న కెదురుగా తీరికగా కూచునివున్న నామొహంకేసి ఓ మాటు చూచింది.

"అదేమిటమ్మా? అల్లా అంటావు? ఏదో, నీవూ — నాన్నా యిక్కడ వున్నన్నాళ్లూ నీచేతిమీదే పోనియ్యరాదా?" అన్నాను.

"ఏమో నాయనా? నావల్లకాదు యింత డబ్బు కర్చుపెట్టడం! సంసారంచూస్తే జానెడేకాని కర్చుమాత్రం బారెడు!!" అంది తలపైకెత్తకుండానే.

"అవును! అన్నివస్తువులూ కొనుక్కోవాలాయెను మఱి! ఏదైనా వూరికే వచ్చిపడితే డబ్బుఖర్చుకాదు!"

"ఊరికే యెవరు కావాలన్నారు? ఈ వూళ్లో అన్ని వస్తువులూ ప్రియమూ - కాటకమూనూ. అంచేత డబ్బు కనిపించదు"

"ఈవూళ్ళోనే కాదమ్మా! అంతటా యిట్లాగే వుంది. మనవూళ్ళో మనకన్నీ పండుతాయి గనుక అక్కడ మనకు వాటి ధరలు తెలుసుకోవాలిసిన పనిలేదు."

నామాటలందుకొని మానాన్న "మనవూళ్ళోమట్టుకు యేమి చౌక? పంటసంసారులకుమాత్రం ఖర్చులేదా? ఎన్ని కొనుక్కోవాలి తెల్లవారి లేచింతరువాత? అవచ్చిన డబ్బు తిండికీ, వ్యవసాయపెట్టుబడులకీ సరిపోక "అలో-లక్షణా" అని వాళ్లూ యేడుస్తూనే వున్నారు" అన్నాడు.

"అయితే యింక సుఖంగా వుంది యెవర్నూ? బ్లాకు మార్కెట్లలో వ్యాపారంచేసి రెట్టికి మూడు నాలుగు రెట్లు ధరలు పెంచి డబ్బుసంపాయించే వర్తకులేమైనా సుఖంగా వుండాలి మఱి!" అంది చిట్టి.

"ఆ" అని ఒహ నిట్టూర్పువుచ్చి "వాళ్ళకుమట్టుకు సుఖం యేదీ? ఎంత డబ్బు గడించినా వాళ్లుమాత్రం డబ్బే తింటారా? తిండికీ—బట్టకీ, వాళ్లూ ఒహళ్లమీద ఆధార బడాలిసిందే! ఒహమాదిరిగా సంపాయించి యింకోమాదిరిగా వాళ్ళూ ఖర్చుపెట్టాలిసిందే!" అన్నాను.

"అది కాదు. ఈరోజుల్లో అందరిదగ్గరా డబ్బు ఎవరికి తగినంత వారిదగ్గర వుంది. పూర్వం రూపాయ సంపాయించుకునే వాడిప్పుడు పది రూపాయలు సంపాయిస్తున్నాడు. అయిదారేండ్లక్రితం అణా కాసుకున్న విలువ యిప్పుడు రూపాయకు లేదు. మాచిన్నతనంలో వంద రూపాయల నోటు వుంటే అతడెంతో ధనవంతుడు! ఆకాయితాన్ని యెవరూ చూడకుండా యెన్నో పెట్టెలలోపెట్టిదాచి, చివరికి దాన్ని మార్చాలిసివస్తే పది పన్నెండుచోట్లైనా తిరగాలిసి వచ్చేది. ఇప్పుడు అట్లాంటి కాయితాలు అందరివద్దా వేసకు వేలున్నయి. ఎవరిచేతిలో చూచినా నోట్లకట్టలే! డబ్బంటే యెవరికీ లక్ష్యంలేదు. దీనికంతా కారణం డబ్బుకు విలువ తగ్గడమూ-వస్తువుల విలువ హెచ్చడమూ! అందుకే దీన్ని నేను పిచ్చిడబ్బు అంటాను" అన్నాడు మానాన్న.

"ఔను! నిజంగా పిచ్చిడబ్బే! అందుకు సందేహమేమీ లేదు. పూర్వం రూపాయమార్చి పదహారణాలు చేత్తోపుచ్చుకుంటే, వారం పది రోజులు మహరాజులాగా యింటివెచ్చానికి సరిపొయ్యేది. ఇప్పుడా రూపాయకు ఓనాడూ ఒహ వెచ్చమూ రాదు" అంది చిట్టి.

మామాటలు వింటూనే మాఅమ్మ చివుక్కున లేచి పంటింట్లోకి వెళ్లి అప్పుడే తెచ్చిన బజారు వెచ్చాలజాబితా తెచ్చి మాముందు పడేసి—

"చూడండీ జాబితా! అన్నివస్తువులూ యెల్లామండుకు పోతున్నాయో? వీశె పావలా, అయిదణాలుండే చింతపండు రూపాయన్నర! బేడా, బేడార్ధణాకిచ్చే వుల్లిపాయలు రూపాయ! పదిహేనణాలు రూపాయవుండే నువ్వులనూనె నాలుగున్నర! పంచదార అసలు చూద్దామంటే లేదుగదా? ఇహ బియ్యంసంగతి చెప్పనే అఖర్లేదు" అని యింకా యేమేమో చెప్పబోతోంది.

ఆమె మాటకడ్డంవచ్చి "ఔనమ్మా! అన్నివస్తువుల ధరలూ మండుకపోతూనే వున్నాయి. అందుకే ఇవి కరువు రోజులు. ఎన్నివందలు తెచ్చుకున్నా ఎప్పటికప్పుడు సంసారాలు కటకటపడడమే!" అన్నాను.

"అట్లాంటప్పుడు యీ సంసారాలు యెవరుచేసినా ఒహటే! ఇద్వాళవుండి రేపు పొయ్యేవాళ్ళం మాకెందుకు నాయినా యీలావాదేవీలు? మీసంసారం మీరే చేసుకోండి" అంది.

ఆమె మాటలకు చిట్టి నవ్వుతూ నా మొహంకేసి చూసింది పాప మావృద్ధురాల నా బాదర బందీనుండి తప్పించమన్నట్టుగా.

"సరే! నీకంత కష్టమయితే మీకోడలిమీదే పెట్టు ఆ భారం తిరిగి" అన్నాను.

ఆరోజునుంచే తిరిగి చిట్టి మామూలుగా తన సంసార భారం తానే మొయ్యసాగింది.

కాలం గడిచిపోతోంది అల్లాగే ఆవచ్చింది చాలీ చాలకుండా.

ఎప్పుడేనా మాటవరసకి "చిట్టీ! యిదేమిటి! ఈ నెలలో యింత ఖర్చా?" అని నేనంటే "ఔను! పిచ్చిడబ్బు! నేనేం చేసేది?" అని జవాబిస్తోంది చిట్టి.

నేను చేసే ఖర్చులకు కూడా చిట్టి అప్పుడప్పుడు వేళాకోళంచేస్తే నేనూ అల్లాగే జవాబియ్యక తప్పడం లేదు.

ఇంతకూ, ఈ డబ్బుకీ పిచ్చి యెప్పుడు వదలి మామూలురోజులు వస్తాయో? యేమొ?

